RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | శనివారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 252 | సెప్టెంబర్ 06, 2025 | వెల : రూ.3-00



తరగతి గదుల్లోనే దేశ భవిష్యత్తు ఉంటుంది

2లో..


















# వెళ్లి రావయ్యా..గణపయ్య

- గంగమ్మ ఒడికి పార్వతి తనయుడు
- కోలాహలంగా గణపతి నిమజ్జనం
- డీజే, డప్పుల హోరు.. యువతీ యువకుల కేరింతలు
- శోభాయాత్రలో తరలివచ్చిన భక్తజనసంద్రం

## బై బై.. మళ్లీ కలుస్తా.. ఏకదంతుడు

**వేద న్యూస్, కల్చరల్:**

ఉత్సవం ఉరకలేత్తింది.. భక్తి భావం ఉప్పొంగింది.. గల్లీ టు ఢిల్లీ ప్రతిష్టించబడిన విఘ్నేశ్వరుడి నిమజ్జన వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. శుక్రవారం రాష్ట్రంలో వినాయక నిమజ్జన శోభాయాత్రలు ఘనంగా నిర్వహించారు. 'గణపతి బప్పా మోరియా', 'గణేష్ మహా రాజ్ కి జై' అంటూ గణేశ్ మండప నిర్వాహకులు, పిల్లలు, పెద్దలు, భక్తులు చేసిన నినాదాలు మార్మోగాయి. వినాయక విగ్రహాల నిమజ్జనం సందర్భంగా వరంగల్ నగరం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. గణేశుడి విగ్రహాల శోభయాత్రను పురస్కరించుకుని పురవీధులు కిటకిటలాడాయి. భక్తుల జయ జయ ద్వానాల నడుమ విగ్రహాలు ఊరేగింపు కన్నులపండువగా సాగింది. చిన్నారులు, పెద్దలు కాషాయ వస్త్రాలు తలకు చుట్టుకుని 'గణపతి బప్పా మోరియా' నినాదాలతో సందడి చేశారు. రంగుల చల్లుకుంటూ, డాన్సులు చేస్తూ ఉత్సాహంగా ముందుకు సాగారు. శోభయాత్రలో కళాకారులు పౌరాణిక వేషాలతో సందండి చేశారు.


- మళ్లీ కలుస్తా..


నగరంలో ఏర్పాటు చేసిన విగ్రహాలను ఊరేగింపుగా జిల్లా పరిధిలోని పలు చెరువులలో వినాయకుల విగ్రహాలు నిమజ్జనం చేశారు. తొమ్మిది రోజులు పూజలు అందుకుని ఆశీర్వదించిన గౌరీ తనయుడు 'మళ్లీ కలుస్తా.. ఇక సెలవు' అంటూ గంగమ్మ ఒడికి చేరాడు. పలువురు చిన్నారులు బుజ్జి గణపతులను నిమజ్జనం చేస్తూ.. ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.














## మోదీ చిత్రపటానికి పాలాభిషేకం



**వేదన్యూస్, ప్రతినిధి మెట్ పల్లి:**

మెట్ పల్లి పట్టణ శాఖ ఆధ్వర్యంలో నరేంద్ర మోడీ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రాచకొండ యాదగిరి బాబు, బి జె పి కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రపంచ దేశాలు, ఆంక్షలు అధిక పన్నుకు భయడుతుంటే వాటన్నిటిని బేకతారు చేసి,దేశ ప్రజలపై పన్ను భారం తంగ్గిచిన దైర్యం గల దేశం భారతదేశం..దమ్మున్న నాయకుడు నరేద్ర మోదీ అని అన్నారు.

# మోదీ చిత్ర పటానికి పాలాభిషేకం

**వేద న్యూస్, శాయంపేట:**

స్వతంత్రం భారతంలో వచ్చిన విప్లవాత్మక పన్ను సంస్కరణలు అమలు నిత్యావసరాలు ,ఆహార పదార్థాల పై పన్ను పద్దెనిమిది శాతం, పన్నెండు శాతం నుంచి ఐదు శాతం సున్న శాతం తగ్గింపు తీసుకురావడం అనేది గొప్ప ఆశించదగ్గ విషయమని శాయంపేట మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు .ఈ సందర్భంగా అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ,రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ రాయరాకుల మొగిలి వారు మాట్లాడుతూ వ్యవసాయ యంత్రాలు , స్ప్రే పార్ట్స్, ఎరువుల పై పద్దెనిమిది శాతం, పన్నెండు శాతం నుంచి ఐదు శాతం కి తగ్గింపు.ఆరోగ్య భీమా, జీవిత భీమా ప్రీమియం పై పన్ను పద్దెనిమిది శాతం నుండి సున్న శాతం కి తగ్గింపు. దేశ ప్రజలకు దసరా దీపావళి కానుకగా సెప్టెంబర్ ఇరవై రెండు నుంచి అమల్లోకి వస్తుంది అన్నారు.ప్రధానమంత్రి మోదీ ఆగస్ట్ పదిహేను న స్వతంత్ర దినోత్సవ ప్రసంగంలో సూచనప్రాయంగా జీ ఎస్ టి సంస్కరణల గురించి మాట్లాడటం జరిగింది అన్నారు . కానీ ప్రజలు ఊహించిన దానికంటే గొప్పగా జీ ఎస్ టి పన్ను తగ్గింపులు తీసుకువచ్చింది కేంద్ర ప్రభుత్వం అని కొనియాడారు.

ముఖ్యంగా మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి ని దృష్టిలో పెట్టుకుని తీసుకువచ్చిన ఈ పన్ను తగ్గింపులు స్వతంత్ర భారతంలో వచ్చిన గొప్ప పన్ను సంస్కరణల్లో ఒకటిగా నిలబడుతుంది అన్నారు . గత బడ్జెట్లో ప్రవేశపెట్టిన పన్నెండు లక్షల వరకు వ్యక్తిగత ఆదాయ పన్ను మినహాయింపు కూడా మధ్యతరగతి వేతన జీవులకు ఒక వరం లాంటిదనీ అన్నారు.ఈ పన్ను సంస్కరణల వల్ల వచ్చే ఐదు-ఆరు నెలలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదాయాల్లో కొంత కోత పడినా ఆ మొత్తం ప్రజలకు ఆదా అయి ఇతర అవసరాల కోసం వెచ్చించే అవకాశం ఉంటుందనీ అన్నారు .ప్రజల కొనుగోలు శక్తిని పెంచడం తద్వారా దేశంలో తయారీ రంగాన్ని , వ్యవసాయ రంగాన్ని, నిర్మాణ రంగాలను బలపరిచే లక్ష్యంగా తీసుకువచ్చిన ఈ పన్ను సంస్కరణలు దేశ ఆర్థిక వృద్ధికి దోహద పడతాయనడంలో సందేహం లేదనీ వారు అన్నారు.



ఈ విప్లవాత్మక సంస్కరణలు తెచ్చిన ప్రధాని మోడీ కి,ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ కి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు కోడెపాక స్వరూప, యువ మోర్చా జిల్లా నాయకులు కొత్తపల్లి శ్రీకాంత్, మండల ప్రధాన కార్యదర్శి భూతం తిరుపతి, మండల ఉపాధ్యక్షుడు కోమటి రాజశేఖర్, మండల కార్యదర్శి మేకల సుమన్,బూత్ అధ్యక్షులు బాసాని నవీన్, కన్నెబోయిన రమేష్ కురాకుల చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు



**వేద న్యూస్, జగిత్యాల :**

బండాలింగాపూర్ గ్రామంలో ఫ్రీడమ్ యూత్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా చాలా ఆనందకరంగా గణేష్ భగవాన్ నవరాత్రి ఉత్సవాలు జరుపుకోవడం జరిగింది. అదేవిధంగా స్వామివారి శోభయాత్ర ఎలాంటి మందు మాంసాహారాలు తీసుకోకుండా స్వామివారి శోభాయాత్ర మరియు నిమజ్జనం చేయడం జరిగింది. గత 40 సంవత్సరాల నుండి ఫ్రీడమ్ యూత్ వారు గణేష్ ఉత్సవాలు భక్తి యుక్తంగా భజన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు పాల్గొన్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయులుగా నలుగురు

**వేద న్యూస్, శాయంపేట:**

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా హనుమకొండ జిల్లా విద్యాశాఖ ప్రకటించిన జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులకు గాను శాయంపేట మండలం నుండి నలుగురు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు.ఈ అవార్డు పొందిన వారిలో జిహెచ్ఎం గ్రేడ్ రెండు కేటగిరిలో అల్లం మాధవి జీ హెచ్ ఎం నేరేడుపల్లి ,శేఖర్ బాబు ఎస్ ఎ ఇంగ్లీష్ జెడ్ పి హెచ్ ఎస్ శాయంపేట బాలిక ,ఎస్ ఉదయశ్రీ ఎస్ ఏ తెలుగు జడ్.పి.హెచ్.ఎస్ శాయంపేట బాలుర ,చల్ల అశోక్ ఎల్ ఎఫ్ హెచ్ఎం ఎంపిపిఎస్ శాయంపేట జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలు మాట్లాడుతూ వారి ఎంపికకు సహకరించిన హనుమకొండ జిల్లా కలెక్టర్ , జిల్లా విద్యాశాఖ అధికారికి, మండల విద్యాధికారికి , శాయంపేట మండలంలోని వివిధ ఉపాధ్యాయిని ఉపాధ్యాయ మిత్రులకు సంఘ నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.మునుముందు ప్రభుత్వ విద్యారంగ పటిష్టతకు మరింత ఉత్సాహంతో పనిచేస్తూ శాయంపేట, హనుమకొండ విద్యా శాఖకు మంచి పేరు తెస్తామని తెలిపారు.



## పాము కాటుకు చిన్నారి మృతి

**వేద న్యూస్, చొప్పదండి :**

చొప్పదండి మండలం వెదురుగట్ట గ్రామానికి చెందిన గర్వంద రవీందర్ చిన్న కుమార్తె గర్వాంద దీప్తిక (12) కృష్ణవేణి ని పాము కాటు వేయడంతో మృతి చెందింది. తన తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



## డంపింగ్ యార్డ్ గా మారిన బస్టాండ్..!


**వేద న్యూస్, సిరిసిల్ల :**



సిరిసిల్ల పట్టణంలోని కొత్త బస్టాండ్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలం ఇప్పుడు డంపింగ్ యార్డ్ గా మారిపోయింది. ఈ స్థలంలో పేరుకుపోయిన చెత్తాచెదారం, చనిపోయిన జంతువుల శవాల వల్ల తీవ్రమైన దుర్వాసన వెదజల్లుతోంది. దీని కారణంగా బస్టాండ్లో నిలబడటానికి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.ఈ పరిస్థితిపై సీపీఎం జిల్లా కార్యదర్శి ముశం రమేష్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ, ఈ చెత్తాచెదారం వలన దోమలు, ఈగలు పెరిగి చుట్టుపక్కల నివసించే ప్రజలు విష జ్వరాలు, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని తెలిపారు. పట్టణ నడిబొడ్డున ఇంత దారుణమైన పరిస్థితి ఉన్నప్పటికీ, బస్ డిపో మేనేజర్, మున్సిపల్ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ఆయన విమర్శించారు. వారికి దీనితో సంబంధం లేదన్నట్టుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని, తక్షణమే ఈ ఖాళీ స్థలాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, ప్రజలకు ఉపయోగపడే ఇతర అవసరాల కోసం వినియోగించాలని రమేష్ డిమాండ్ చేశారు. లేకపోతే ఈ స్థలం ఇలాగే డంపింగ్ యార్డ్గా కొనసాగు తుందని ఆయన హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు నక్క దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

## కల్వకుంట్ల కుటుంబం తెలంగాణ వనరులను దోచుకుంది

- ధరణిని అడ్డుపెట్టుకొని వేల ఎకరాల భూములు కబ్జా చేశారు
- కల్వకుంట్ల కుటుంబంలో జరుగుతున్న గొడవలు ఆస్తికి సంబంధించినవే
- లింగాల గణపురం మండలం నవాబుపేట రిజర్వాయర్ నుంచి సాగునీటిని విడుదల
- ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**వేద న్యూస్ డెస్క్:**

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్పై స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి హాట్ కామెంట్స్ చేశారు. కల్వకుంట్ల కుటుంబంలో జరుగుతున్న గొడవలు ఆస్తికి సంబంధించినవేనని ఆరోపించారు. ఇవాళ(శుక్రవారం) జనగామ జిల్లాలోని లింగాల గణపురం మండలం నవాబుపేట రిజర్వాయర్ నుంచి సాగునీటిని విడుదల చేశారు. అనంతరం కడియం శ్రీహరి మీడియాతో మాట్లాడారు. పదేళ్ల అధికారంలో కల్వకుంట్ల కుటుంబం తెలంగాణ వనరులను దోచుకుందని విమర్శించారు. ధరణిని అడ్డుపెట్టుకొని వేల ఎకరాల భూములు కబ్జా చేశారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టును అడ్డుపెట్టుకొని కేసీఆర్ కుటుంబం వేల కోట్ల రూపాయలు సంపాదించిందని ఆక్షేపించారు. వేల ఎకరాల భూములు, వేలకోట్ల రూపాయలు పంచుకునే క్రమంలో కేసీఆర్ కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయని చెప్పుకొచ్చారు కడియం శ్రీహరి. కేసీఆర్ కుటుంబ గొడవలతో తెలంగాణ ప్రజలకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీకి, కాంగ్రెస్ ప్రభుత్వానికి కూడా సంబంధం లేదని క్లారిటీ ఇచ్చారు. తాను బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేయడానికి ప్రధాన కారణం కేసీఆర్ బిడ్డ లిక్కర్ కేసులో ఇన్వాల్వ్ అయినందుకేనని షాకింగ్ కామెంట్స్ చేశారు. కవిత లిక్కర్ కేసులో విచారణను ఎదుర్కోవడం అనేక రోజులు జైల్లో ఉండటం సరైన పద్ధతి కాదని తాను బయటకు వచ్చానని చెప్పుకొచ్చారు. అవినీతి డబ్బులను పంచుకోవడంలో వారి మధ్య జరిగిన గొడవే తప్పా.. మరి ఇంకా ఏం లేదని ఎమ్మెల్యే కడియం శ్రీహరి విమర్శించారు.

# తరగతి గదుల్లోనే దేశ భవిష్యత్తు ఉంటుంది

- గురుపూజోత్సవం సందర్భంగా ప్రభుత్వం తరపున హైదరాబాద్లోని శిల్పకళా వేది
- ఎంతో సమయం వెచ్చించి అందరితోనూ ఉల్లాసంగా గడిపిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**వేద న్యూస్ డెస్క్:**



తొలుత తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్ సొసైటీ విద్యార్థినుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ప్రాంగణంలోకి వచ్చీ రాగానే విద్యార్థినీ విద్యార్థులతో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ను ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతి స్టాల్స్ను సందర్శించడమే కాకుండా ఆయా రంగాల్లో వారు ప్రదర్శించిన నైపుణ్యాల గురించి ఒక్కొక్కరిని అడిగి మరీ తెలుసుకున్నారు. పాఠశాల విద్యార్థుల నుంచి వర్సిటీ అధ్యాపకుల వరకు అన్ని స్థాయిల్లో స్టాళ్లలో ప్రదర్శకు ఉంచిన వస్తువుల వివరాలను అడిగారు. ముఖ్యమంత్రి కార్యక్రమ ప్రాంగణానికి వచ్చిన సందర్భంగా ఎన్సీసీ, ఎన్ఎస్సెస్, స్కౌట్స్ అండ్ గైడ్స్, స్కూల్ బ్యాండ్ పిల్లలతో కరచాలనం చేస్తూ కలివిడిగా తిరిగారు. తరగతి గదుల్లోనే దేశ భవిష్యత్తు ఉంటుందని విశ్వసించే ముఖ్యమంత్రి వారితో ఎక్కువ సమయం వెచ్చించారు. పాఠశాల విద్య, ఇంటర్మీడియట్, టెక్నికల్, ఉన్నత విద్యా శాఖల ఆధ్వర్యంలో పాఠశాలల నుంచి వర్సిటీల స్థాయి వరకు సంప్రదాయ వస్తువులు, సేంద్రీయ సేద్యం నుంచి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వరకు అన్ని రంగాల్లో వారి వారి పరిశోధనలు, నూతన ఆవిష్కరణలను ప్రదర్శనగా ఉంచారు. ఒక్కొక్కరిగా అందరి వద్దకు వెళ్లిన ముఖ్యమంత్రి వారు చెప్పే అనేక విషయాలను ఆసక్తిగా విన్నారు. ఆ తర్వాత ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలతో ఫోటో దిగారు.



# మరిన్ని బ్రిడ్జిలు ఏర్పాటు చేయాలి

**వేద న్యూస్, కోనరావుపేట:**



రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం కొండాపూర్ గ్రామ ప్రజలకు ఎప్పటినుంచో ఉన్న రాకపోకల సమస్యకు చెక్ పడింది. గతంలో వర్షాలు కురిసినప్పుడల్లా మూల వాగు, పెంటి వాగులలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో రహదారులు తెగిపడి, సిరిసిల్ల, కోనరావుపేట మండల కేంద్రం, వేములవాడలకు వెళ్లే మార్గం మూసుకుపోయేది. కొండాపూర్, వెంకట్రావుపేట, వెంకట్రావుపేట, బావుసాయిపేట రహదారులు తరచూ ప్రవాహంతో చెడిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. అయితే, గత ప్రభుత్వం బిఆర్ఎస్ హయాంలో పంచాయతీరాజ్ నిధుల ద్వారా 5కోట్ల 1ఒక లక్ష మంజూరై, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సహకారంతో కొండాపూర్, వెంకట్రావుపేట మధ్య కొత్త బ్రిడ్జి నిర్మాణం పూర్తయింది. దీంతో గ్రామ ప్రజలు సాఫీగా ప్రయాణం చేసే అవకాశమొచ్చింది. వివాహాలు, అత్యవసర పనులు, రోజువారీ రాకపోకలకు ఇక ఎలాంటి అంతరాయం లేకుండా మార్గం ఏర్పడిందని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇకపై సిరిసిల్ల, సిరికొండ నిజామాబాద్ జిల్లాకు వెళ్లే ప్రధాన రహదారి వద్ద పెంటి వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని, అలాగే బావుసాయిపేట, వెంకట్రావుపేట మధ్యలో కూడా కొత్త బ్రిడ్జి ఏర్పాటు చేయాలని సంబంధిత గ్రామ ప్రజలు కోరుతున్నారు. అంతేకాక, గత ప్రభుత్వాలు ఏర్పాటు చేయని బ్రిడ్జిలను ఈ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అయినా నిర్మించి, మూల వాగు పరివాహక ప్రాంతాల ప్రజలకు రాకపోకలు సులభతరం చేసే చర్యలు తీసుకోవాలని కూడా స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. గ్రామస్తులు ఈ సందర్భంగా మాట్లాడుతూ, మునుపు వర్షాలు పడితే రోడ్లు మూసుకుపోయి చాలా ఇబ్బందులు ఎదుర్కొనేవాళ్లం. ఇప్పుడు బ్రిడ్జి నిర్మాణంతో ఆ సమస్యలకు తెరపడింది. మిగిలిన వాగులపై కూడా బ్రిడ్జిలు ఏర్పాటు చేస్తే రాకపోకలకు పూర్తిగా సౌలభ్యం కలుగుతుంది అని హర్షం వ్యక్తం చేశారు. అలాగే మూలవాగు ప్రాంతాలు వట్టిమల నుండి నిమ్మపెల్లి, మామిడిపల్లి నుండి నిజామాబాద్ బ్రిడ్జిలు కూడా త్వరలో పూర్తి చేయాలని పరివాహక ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

# డాక్టర్ కోడూరి శ్రీవాణి అవార్డు స్వీకరణ

**వేద న్యూస్, డెస్క్:**



**- రాష్ట్ర ఉత్తమ ఆచార్యురాలుగా**

శాతవాహన విశ్వవిద్యాలయం అర్థశాస్త్ర విభాగపు అధిపతి డాక్టర్ కోడూరి శ్రీవాణి ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని శిల్పకళా వేదిక శిల్పారామం హైదరాబాదులో తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితారాన ఐఏఎస్, శాసనమండలి సభ్యులు పి. శ్రీపాల్ రెడ్డి మరియు శాతవాహన విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్. ఉమేష్ కుమార్ చేతుల మీదుగా 2025 విద్యా సంవత్సరానికి గాను ఉన్నత విద్యా విభాగంలో రాష్ట్ర ఉత్తమ ఆచార్యురాలుగా అవార్డును స్వీకరించినది. శ్రీవాణి కరీంనగర్ జిల్లా కేంద్ర నివాసురాలు. ప్రస్తుతం శాతవాహన విశ్వవిద్యాలయంలో అర్థశాస్త్ర విభాగంలో సీనియర్ సహాయ ఆచార్యులుగా విధులు నిర్వహిస్తున్నారు. ఆమె గతంలో కరీంనగర్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలుగా, కరీంనగర్ జిల్లా ఉత్తమ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ గా మరియు పద్మ జీవిత సాఫల్య పురస్కారాలను స్వీకరించినది. ఆమె జాతీయ స్థాయిలో రెండు సదస్సులను, ఒక స్వల్పకాలిక ప్రాజెక్టును పూర్తి చేసినది. ఆమె స్వతగా వివిధ ఆర్థిక అంశాలపై 7 పుస్తకాలను రచించింది. 62 పరిశోధనా వ్యాసాలు వివిధ జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్,పుస్తకాలలో ప్రచురితం అయినాయి. తన మార్గదర్శకత్వంలో ఇద్దరు పరిశోధక విద్యార్థులు పీహెచ్డీ ని పూర్తి చేశారు. రాష్ట్ర ఉత్తమ ఆచార్యురాలుగా అవార్డు రావడం పట్ల విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ యు. ఉమేష్ కుమార్ ,రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జాస్తి. రవికుమార్ , వి సి ఓ ఎస్ డి డాక్టర్.డి. హరికాంత్ , విశ్వవిద్యాలయ ఆర్ట్%డ% సోషల్ సోషల్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్.సూరేపల్లి సుజాత గారు మరియు కళాశాల మిగతా ఆచార్యులు, అధ్యాపకేతర బృందం, పరిశోధక విద్యార్థులు మరియు విద్యార్థిని విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ అవార్డు రావడం పట్ల డాక్టర్ శ్రీవాణి ఉపకులపతి ప్రొఫెసర్. యు. ఉమేష్ కుమార్ కి,రిజిస్ట్రర్ ప్రొఫెసర్ .రవికుమార్ జాస్తి కి మిగతా అధ్యాపక, అధ్యాపకేతర బృందానికి ధన్యవాదాలు తెలిపారు.

# రాష్ట్ర ఉత్తమ అధ్యాపకురాలుగా డా. కోడూరి శ్రీవాణి

**వేద న్యూస్, డెస్క్:**

శాతవాహన విశ్వవిద్యాలయంలో అర్థశాస్త్ర విభాగం అధిపతిగా మరియు విశ్వవిద్యాలయ అదనపు పరీక్షల నియంత్రణ అధికారిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ కోడూరి శ్రీవాణి 2025 సంవత్సరానికి గాను ఉన్నత విద్యా విభాగంలో రాష్ట్ర ఉత్తమ అధ్యాపకురాలిగా తెలంగాణ ప్రభుత్వం ఎంపిక చేసినది. సెప్టెంబర్ 5, 2025న జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని హైదరాబాదులోని శిల్పకళా వేదికలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రశంసా పత్రం స్వీకరించనున్నారు.

ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎలిగేడు గ్రామంలో జన్మించిన శ్రీవాణిది నిరుపేద చేనేత కుటుంబం తల్లి బీడీ కార్మికురాలు. శ్రీ వాణి చదువుకుంటూనే తల్లికి చేదోడు వాదోడుగా ఉంటూ బీడీలు చుట్టుతు తన విద్యాభ్యాసాన్ని కొనసాగించింది. ఆమె చదువు అంత ప్రభుత్వ విద్యా సంస్థలోనే కొనసాగింది. ఆమె విద్య ప్రయాణమంతా ర్యాంకులు, బంగారు పతకాలతో సాగింది. ఎలిగేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి ప్రథమ శ్రేణిలో, సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల ,కరీంనగర్లో ఇంటర్మీడియట్( హెచ్ ఈ సి) కళాశాలలో అన్ని గ్రూపులతో కలిసి మొదటి ర్యాంకు సాధించినారు. కరీంనగర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బి.ఏ లో కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలో 9వ ర్యాంకు సాధించారు. ఎం ఏ ఎకనామిక్స్ లో మొదటి ర్యాంకుతో మూడు బంగారు పథకాలను స్వీకరించినది. కాకతీయ విశ్వవిద్యాలయం యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ లో బీ.ఈడీ ఎం.ఈడి లో ప్రథమ ర్యాంకు సాధించారు. శ్రీవాణి విద్యా అర్హతలు ఎం. ఏ అర్థశాస్త్రం, బీఈడీ, ఏం ఈ డి, ఎం.ఫీల్ అర్థశాస్త్రం, పీహెచ్డీ అర్థశాస్త్రం, అర్థశాస్త్రంలో నెట్ మరియు సెట్, ఎడ్యుకేషన్లో నెట్ పూర్తి చేశారు. ఒకే సంవత్సరంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ఏపీ ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ (గెజిటెడ్ హోదా) అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్, డిగ్రీ కాలేజీ లెక్చరర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఇన్ ఎకనామిక్స్ తెలంగాణ విశ్వవిద్యాలయం ,అసిస్టెంట్ ప్రొఫెసర్ ఇన్ ఎకనామిక్స్ శాతవాహన విశ్వవిద్యాలయం మొదలగు ఏకకాలంలో ఆరు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైనది. సోషల్ స్టడీస్ స్కూల్ అసిస్టెంట్ గా ప్రభుత్వ బాలికల పాఠశాల మహాదేవపూర్ లో,



ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకురాలుగా కాసు బ్రహ్మానందరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మాచర్ల, గుంటూరు జిల్లాలో, అర్థశాస్త్ర విభాగంలో సహాయాచార్యులుగా తెలంగాణ విశ్వవిద్యాలయంలో కొంతకాలం సమర్థవంతంగా విధులు నిర్వహించినారు. ప్రస్తుతం శాతవాహన విశ్వవిద్యాలయంలో అర్థశాస్త్ర విభాగం లో సీనియర్ సహాయ ఆచార్యులుగా విధులు నిర్వహిస్తున్నారు. విశ్వవిద్యాలయంలో ఒకపక్క విద్యార్థులకు పాఠాలు బోధిస్తూనే పరిశోధనా రంగంలో అత్యుత్తమ పనితీరును కనబరుస్తున్నారు. శ్రీవాణి జాతీయస్థాయిలో "75 సంవత్సరాల భారత ఆర్థిక వ్యవస్థ విజయాలు-సవాళ్లు" మరియు "వికసిత్ భారత్ ఏ 2047 ఇండియా విజన్ ఫర్ డెవలప్మెంట్" అనే అంశంపై ఐసిఎస్ఎస్ఆర్ న్యూఢిల్లీ వారి ఆర్థిక సహకారంతో రెండు రోజుల జాతీయ సెమినార్లను రెండింటిని విజయవంతంగా నిర్వహించింది. విశ్వవిద్యాలయానికి మొట్టమొదటిసారిగా ఐ సి ఎస్ ఎస్ ఆర్ న్యూఢిల్లీ వారు మంజూరు చేసిన స్వల్పకాలిక ప్రాజెక్టు అయిన" గ్రామీణ ప్రాంతాలలో సుకన్య సమృద్ధి యోజన పథకం అమలుతీరు" అనే అంశంతో ప్రాజెక్టును పూర్తి చేశారు. ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం మరియు కోవిన్ -19 సమయంలో అనేక వేబినార్లు మరియు వర్క్ షాప్ లు నిర్వహించినారు .

గతంలో శ్రీవాణి విద్యారంగంలో అత్యున్నతంగా రాణిస్తున్నందుకు తెలంగాణ రాష్ట్ర పద్మశాలి ప్రొఫెషనల్ అండ్ అఫీషియల్ సొసైటీ వారిచే పద్మ రత్న జీవిత సాఫల్య పురస్కారాన్ని స్వీకరించినది. కరీంనగర్ జిల్లా ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో జిల్లా ఉత్తమ మహిళా అధ్యాపకురాలిగా పురస్కారాన్ని స్వీకరించినది. ఆగస్టు 15, 2023లో శాతవాహన విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం సమన్వయకురాలుగా ఉత్తమ సేవలు చేస్తున్నందుకు కరీంనగర్ జిల్లా ఉత్తమ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ గా స్వాతంత్ర దినోత్సవం రోజున అప్పటి తెలంగాణ రాష్ట్ర బీసీ మరియు పౌర సరఫరాల శాఖ మాజీ మంత్రి శ్రీ గంగుల కమలాకర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని స్వీకరించినది. శాతవాహన విశ్వవిద్యాలయం బాలికల వసతి గృహాల చీఫ్ వార్డెన్ గా, అదనపు పరీక్షల నియంత్రణ అధికారి యూజీ విభాగం, జాతీయ సేవా పథకం కోఆర్డినేటర్ గా ,అదనపు పరీక్షల నియంత్రణ అధికారి కాన్ఫిడెన్షియల్ విభాగం సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. తన పరిశోధన మార్గదర్శకత్వంలో ఇద్దరు పరిశోధకులు పిహెచ్డిని పూర్తి చేశారు. ఉన్నత విద్యా విభాగంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ అధ్యాపకురాలిగా ఎంపిక చేయడం పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి మరియు నిత్యం విశ్వవిద్యాలయ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న ఉపకులపతి ప్రొఫెసర్ ఉమేష్ కుమార్ గారికి ,రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జాస్తి రవికుమార్ గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అంతేకాకుండా గ్రామీణ ప్రాంతాలలో ఆర్థిక సామాజిక కారణాలతో చాలామంది మట్టిలో మాణిక్యాలు బయటి ప్రపంచానికి రాలేకపోతున్నారని అటువంటి సామర్థ్యాలను గుర్తించి విద్యా పరిశోధనా రంగంలో వారిని అత్యుత్తమంగా తీర్చి దిద్దుతానని అదేవిధంగా శాతవాహన విశ్వవిద్యాలయ అభివృద్ధికి మరింత కృషి చేస్తానని న్యూస్టుడేకు డాక్టర్ శ్రీవాణి తెలిపారు.

# ప్రధాని మోదీ చిత్రపటానికి పాలభిషేకం



**వేద న్యూస్,బోయినిపల్లి:**

ప్రపంచ దేశాల్లో నిత్యావసర వస్తువులు గగనాన్ని అంటుతున్నా.. పన్ను భారంతో తమ ప్రజల వెన్ను విరుస్తున్నా.. దేశ ప్రజలకు నిత్యావసర సరుకులు తక్కువ ధరకు అందించాలనే ఉద్దేశం తో జీఎస్టీ, ని తగ్గించినందుకు బిజెపి బోయినిపల్లి మండల అధ్యక్షులు ఎడపల్లి పరశురామ్, నేతృత్వంలో, బిజెపి బోయినిపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోదీ, చిత్రపటానికి పాలాభిషేకం చేయడం జరిగింది. పేద ప్రజలకు, మహిళలకు, యువతకు మరియు దేశంలోని అనేక వర్గాల ప్రజలకు నిత్యావసర సరుకులు తక్కువ ధరకు అందించాలనే ఉద్దేశం తో జీఎస్టీ, ని తగ్గించి భారత దేశ చరిత్రలో అతిపెద్ద పన్ను సంస్కరణలను తెచ్చిన వ్యక్తి నరేంద్రమోడీ,జీఎస్టీ కి అడ్డు చెప్పింది కాంగ్రెస్ గబ్బర్ సింగ్,టాక్స్ అంటూ నాటకాలు వేసింది కాంగ్రెస్ ఇప్పుడేమో ధరలు తగ్గితే నష్టమంటూ గగ్గోలు పెడుతోంది.కాంగ్రెస్ ఏడుస్తూనే ఉంటుంది. మన మోదీ మంచి చేస్తూనే ఉంటాడు అని తెలియజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కౌన్సిల్ సభ్యులు ఉదారి నరసింహ చారి, మాజీ మండల అధ్యక్షులు గుడి రవీందర్ రెడ్డి, సీనియర్ నాయకులు బొంగాని అశోక్ గౌడ్, జువ్వెంతుల శ్రీనివాస్ రెడ్డి, సుంకపాక ప్రభు, ఇల్లందుల బాలయ్య, సారంపల్లి రాజు, భోగోజి గంగాధర్ చారి, మిర్యాల శరత్, తుమ్మనపల్లి కిరణ్, మిణుకుల శ్రీనివాస్, రాజూరి కిరణ్, స్వామికుమార్, సావన్పల్లి అనిల్, శ్రీనివాస్, మహేష్, ఐలయ్య, రామానుజం, శ్రీకాంత్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బతుకమ్మ తెప్ప నిర్మాణానికి భూమి పూజ




**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం కొదురుపాక ఆర్ అండ్ అర్ కాలనీలో బతుకమ్మ తెప్ప నిర్మాణానికి శుక్రవారం నాయకులు యువకులు మహిళలు ,గ్రామ ప్రజలు కలిసి భూమి పూజ నిర్వహించారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ప్రతిపాదనల మేరకు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, బతుకమ్మ తెప్ప నిర్మాణానికి రూ.5 లక్షల నిధులు మంజూరు చేశారు. గతంలోనే ఆర్ అండ్ ఆర్ కాలనీలో బతుకమ్మ తెప్ప నిర్మాణానికి నూతనంగా నిర్మిస్తున్న ఆలయ సమీపంలో 24 గుంటల స్థలాన్ని కేటాయించారు. రాబోయే బతుకమ్మ పండుగ నాటికి మహిళలకు బతుకమ్మ తెప్ప అందుబాటులోకి తీసుక రానున్నట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండి శ్రీనివాస్,ఓజ్జల మహేందర్,నాగుల నాగరాజు,తాడగోప్పుల మురళి, జోగినిపల్లి సత్యనారాయణ, బాలాగోని శ్రీనివాస్,నాగుల గౌడ్, కొండల్ రావు,శ్రీనివాస్,మహేందర్ తిరుపతి,శ్రీకాంత్,ప్రశాంత్,అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

# యూరియా కోసం నడిరోడ్డుపై కొట్టుకున్న మహిళలు

**వేద న్యూస్ డెస్క్:**



మహిళలు ఆర్టీసీ బస్సుల్లో సీట్ల కోసం పంచాయితీ పెట్టుకోవడం.. జుట్లు జట్లు పట్టుకొని కొట్టుకోవడం చూసాం కానీ యూరియా కోసం రోజుల తరబడి నిరీక్షిస్తున్న మహిళలు ఒక్క బస్తా కోసం కొట్టుకున్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో నడిరోడ్డుపై మహిళ రైతులు శిఖలు పట్టుకొని తన్నుకోవడం సంచలనంగా మారింది. ఉత్తర తెలంగాణ జిల్లాలో యూరియా కొరత తీవ్ర ఉద్రిక్తతలకు దారితీస్తుంది.. పరస్పర దాడులకు కారణంగా మారుతుంది. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో నిన్న రైతులు గ్రోమోర్ సెంటర్ పై రాళ్లదాడి చేసి అక్కడ నిప్పుపెట్టారు.. ఆ సంఘటన మరువకముందే శుక్రవారం మరో ఘటన జరిగింది. యూరియా విక్రయ కేంద్రం వద్ద ఇద్దరు మహిళ రైతులు శిఖలు పట్టుకొని పొట్టు పొట్టు తన్నుకోవడం కలకలం రేపగా.. ఇది వైరల్గా మారింది. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని వివేకానంద సెంటర్ లో ఆగ్రోస్ కేంద్రం వద్ద ఈ సీన్ జరిగింది.. యూరియా బస్తాల కోసం తెల్లవారుజామునుండే మహిళలు, రైతులు బారులు తీరారు.. ఈ క్రమంలో క్యూ లైన్ లో ఇద్దరు మహిళా రైతుల వద్ద ఘర్షణ చెలరేగింది. ఇద్దరు మహిళలు జుట్లు జుట్లు పట్టుకొని పొట్టు పొట్టుగా కొట్టుకున్నారు. ప్రధాన రహదారిపై పొర్లాడుతూ కొట్టుకోవడం అందర్నీ విస్మయానికి గురిచేసింది. చుట్టుపక్కల వారు ఆపుతున్నా ఆగకుండా ఇద్దరూ పోట్లాడుకున్నారు. చివరకు ఇద్దరు వ్యక్తులు ధైర్యం చేసి ఆ ఇద్దరు మహిళలను బలవంతంగా ఆపారు. ఆగ్రోస్ రైతు సేవాకేంద్రం ముందు మహిళలు, పురుషులు ఆధార్ కార్డులు జిరాక్స్ లు పట్టుకొని పెద్ద సంఖ్యలో బారులు తీరారు. ఒకరినొకరు నెట్టుకోవడంతో స్వల్ప తోపులాట చోటుచేసుకుంది. ఈ సమయంలోనే ఇద్దరు మహిళలు తీవ్రంగా కొట్టుకున్నారు.

వేద న్యూస్

శనివారం సెప్టెంబర్ 06, 2025

# సంపాదకీయం

అమెరికాను కట్టడి చేయలేమా!

భారత్‌లో ఆనాటి బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీనే మించిపోయింది ఈనాటి అమెరికా సామ్రాజ్యవాదం. మన దేశాభివృద్ధికి మన పాలకులు అనుసరించే ఆర్థిక అభివృద్ధి, సంరక్షణ విధానాలను ప్రశ్నించేందుకు, ఎదిరించేందుకు అమెరికా ప్రెసిడెంట్ ఎవరు? వ్యవసాయం, పాడి పరిశ్రమ, మత్స్య పరిశ్రమ మొదలైన ప్రాథమిక రంగాల నుంచి పారిశ్రామిక రక్షణ రంగాల వరకు మనం చేపట్టే విధానాలను ఎప్పుడూ వ్యతిరేకించడమేనా? అమెరికా పని. ఇలాంటి బెదిరింపులకు భారత్ లొంగకుండా స్వయం పోషకత్వాన్ని పెంపొందించుకోవాలి. జాతీయవాదంతో మనం వలస పాలనను పారదోలినట్టు ఈ సామ్రాజ్యవాదుల నయా వలస పాలనను కూడా పారదోలాలి. అమెరికాలో 50 లక్షల మంది ఇండియన్ అమెరికన్లు ఆ దేశ ఆర్థిక అభివృద్ధికి తోడ్పడుతున్నారని తరచూ అభినందిస్తూ ఉంటారు. వీరు పెద్ద టెక్ సంస్థలైన గూగుల్, మైక్రోసాఫ్ట్, ఫైనాన్షియల్ సంస్థలను నడుపుతున్నారు. విద్యా విధాన నిర్ణయాత్మక సంస్థల్లో కీలక పదవుల్లో ఉన్నారు. అమెరికాకు మనవాళ్లు ఇంత చేస్తున్నా.. ఇండియా పట్ల అమెరికా వ్యవహరిస్తున్న తీరు చూసి వారికి విచారం వేయడం న్యాయమే కదా!

అమెరికా తాను ఆపాదించుకున్న ప్రపంచ పెద్దన్న పెద్దరికంతో తాను విశ్వసనీయ భాగస్వామిగా గుర్తించాలంటే అమెరికా కనుసనాల్లో ఉండాల్సిందేనా? వ్యతిరేకిస్తే నియంతగా వ్యవహరిస్తారా? భారతదేశపు మార్కెట్ చాలా పెద్దదని అమెరికాకు తెలుసు. అమెరికాతో మనం శాస్త్ర సాంకేతిక రంగాలలో పోటీ పడుతున్నామని కూడా తెలుసు. మన మానవ వనరులు అమెరికా దేశాభివృద్ధికి ఎలా తోడ్పడుతున్నాయో తెలుసు.. మన ప్రతిభావంతులైన శాస్త్రవేత్తలు, విద్యావంతులు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్స్‌గా, డాక్టర్స్‌గా ఇతర సేవా రంగాలు, అమెరికా శాస్త్ర సాంకేతిక రంగాలలో తోడ్పడుతున్నారు. మార్కెట్ రీత్యా గాని మానవ వనరుల అభివృద్ధి పరంగా గాని భారతదేశం అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ. అయితే పటిష్టవంతమైన ఆర్థిక విధానాలు, ప్రభుత్వ నియంత్రణ లేనందున స్వయం పోషకత్వంలో చైనా లాగా మనం నిలదొక్కులేకపోతున్నాం. సామ్యవాద తరహా సమాజం నుంచి పెట్టుబడిదారి సమాజం వైపు అడుగులు వేశాం. దీనివలన ప్రపంచ పెట్టుబడిదారీ దేశాల కనుసనల్లో ముఖ్యంగా అమెరికా విధానాలకు లోబడిపోయే పరిస్థితి ఏర్పడింది.

78 సంవత్సరాలుగా అనేక సందర్భాలలో అమెరికన్ సామ్రాజ్యవాదం తన ఆదేశాలను పాటించాలని ఇండియా ను బెదిరిస్తుంది. బ్రిటిష్ రాజ్యం నుంచి బిలినియర్ల రాజ్యం వైపుగా భారత్ ఇప్పటికే పునాదులు వేసుకున్నది. ఎందుకంటే మన పెట్టుబడిదారీ వర్గం ఇప్పటికే అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడితో మమేకమైపోయింది. బడా బుర్జువా వర్గ ప్రయోజనాలను నెరవేరుస్తున్న ప్రభుత్వం తన సొంత ప్రయోజనాలను, దేశాభివృద్ధిని ఆర్థిక వ్యవస్థ స్వయం పోషకత్వాన్ని పెంపొందించుకో గలదా? అగ్రరాజ్యం అని చెప్పుకునే అమెరికా తమ పెట్టు బడిదారులను ప్రోత్సహించి ప్రపంచ పెట్టుబడిదారులను నియంత్రించే పరిస్థితి ఉన్నది. నేడు ప్రభుత్వ పాలన పెట్టు బడిదారీ కనుసన్నల్లో కాకుండా ప్రజలను శాస్త్ర సాంకేతిక రంగాలలో మమేకం చేసి వస్తు ఉత్పత్తి చేస్తే ఎవరికీ ఏమీ మనం తీసిపోం. చైనాలో చాలామంది మంత్రులు శాస్త్ర సాంకేతిక రంగాలలో నిష్ణాతులు కావడం వలన అక్కడ ప్రజలు పాలన ఉత్పత్తి ప్రపంచ పోటీని తట్టుకొని అగ్రరాజ్యం అమెరికాను కూడా భయపెడుతున్నది. అటువంటి ప్రభుత్వాలు మనకు ఏవి? నరేంద్ర మోడీ, నెహ్రూ మాదిరి కాకుండా ప్రైవేట్ రంగాన్ని ప్రోత్సహిస్తున్నారు. పారిశ్రామిక విధానాలలో అడ్డంకులు లేకుండా చేస్తున్నారు. కీలకమైన ఖనిజాలు, ఎలక్ట్రానిక్స్, రక్షణ ఎరువులు, తదితర రంగాలు అభివృద్ధి కోసం మనం ప్రయత్నం చేయాలని 79వ స్వాతంత్ర దినోత్సవ ప్రసంగంలో ప్రస్తావించారు. ఇది నెహ్రూ విధానాల కన్నా భిన్నమైనది. స్వావలంబన దిశగా మనదేశం అభివృద్ధి చెందాలంటే స్వదేశీ మార్కెట్‌ను సాంకేతిక పరిజ్ఞానంతో ప్రభుత్వం అభివృద్ధి చేయాలి. ప్రపంచ మార్కెట్‌ను ఎదుర్కోవడానికి ఏం చేయాలో ప్రణాళిక రూపకల్పన జరగాలి. ఇప్పుడు అగ్రరాజ్యాన్ని సవాల్ చేసే రీతిలో అభివృద్ధి మన దేశంలో జరగాలి. స్వావలంబనకు భారత్ ఇప్పుడు తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొంటుంది. ఆ అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి సామ్రాజ్యవాద పెత్తనం నుండి మన దేశం బయటపడాలి. అమెరికా చేస్తున్న ఎలాంటి బెదిరింపులకు భారత్ లొంగకుండా స్వయం పోషకత్వాన్ని పెంపొందించుకోవాలి. జాతీయ వాదంతో మనం వలస పాలన పారదోలినట్టు ఈ సామ్రాజ్యవాదుల నయా వలస పాలన కూడా పారదోలాలి. దేశాన్ని గ్లోబలైజేషన్ అనగా అమెరికా, యూరోప్ దేశాలపై ఆధారపడే ప్రభుత్వ విధానాల నుంచి తప్పించి స్వయం పోషకత్వ విధానాల వైపు ప్రభుత్వ విధానాలు ఉండాలి. ప్రపంచ ఆర్థిక రంగం ఎదుర్కొంటున్న ఈ సుంకాల వలయం నుంచి బయటకు రావాలంటే మన సొంత ఆర్థిక ప్రయోజనాల కోసం ప్రాధాన్యత ఇవ్వాలి. మరలా వలస పాలనకు వ్యతిరేకంగా ఆనాడు విదేశీ వస్త్ర బహిష్కరణ చేసి, స్వదేశీ వస్త్రాలైన ఖాదీ ధరించినట్లుగా ప్రస్తుతం భారతీయులు తయారు చేసిన వస్తువులనే కొనుగోలు చేయాలని మనం గుర్తించాలి. ముందుగా మన అవసరాలు తీర్చుకోవాలి. విదేశీ ఉత్పత్తులపై ఆధారపడకుండా చూసుకోవాలి. దేశ ఆర్థిక వ్యవస్థ స్వయం పోష కత్వానికి ప్రాధాన్యతనివ్వాలి.

# సంచలనం సృష్టించిన యుకీ బాంబ్రీ..

**వేద న్యూస్ డెస్క్:**



యూఎస్ ఓపెన్ టెన్నిస్ గ్రాండ్‌స్లామ్‌లో భారత టెన్నిస్ స్టార్ యుకీ బాంబ్రీ చరిత్ర సృష్టించే దిశగా సాగుతున్నాడు. తొలి గ్రాండ్‌స్లామ్‌పై కన్నేసిన అతను న్యూజిలాండ్ ఆటగాడు మైఖేల్ వీనస్‌తో కలిసి అదరగొడుతున్నాడు. పురుషుల డబుల్స్‌లో ఈ జోడీ తమ కంటే మెరుగైన ర్యాంకర్లను ఓడిస్తూ సంచలనాలు సృష్టిస్తుంది. ఈ క్రమంలోనే సెమీస్‌కు దూసుకెళ్లింది. గురువారం జరిగిన క్వార్టర్ ఫైనల్‌లో యుకీ-వీనస్ జంట 6-3, 6-7(6-8), 6-3 తేడాతో 11వ సీడ్ నికోలా మెక్టిక్(క్రోయేషియా)-రాజీవ్ రామ్(అమెరికా) జోడీపై విజయం సాధించింది. 2 గంటల 37 నిమిషాలపాటు మ్యాచ్ ఆసక్తికరంగా సాగింది. తొలి సెట్ నెగ్గి యుకీ జోడీ శుభారంభం చేసినప్పటికీ రెండో సెట్‌లో మాత్రం తీవ్రంగా శ్రమించిన ఫలితం దక్కలేదు. ప్రత్యర్థులు టై బ్రేకర్‌లో రెండో సెట్‌ను నెగ్గి స్కోర్లను సమం చేశారు. దీంతో మ్యాచ్ నిర్ణయాత్మక మూడో సెట్‌కు వెళ్లగా అక్కడ మాత్రం యూకీ,వీనస్ సత్తాచాటడంతో మ్యాచ్ సొంతమైంది. యుకీ జోడీ విన్నర్ల(60)తో విరుచుకుపడి ప్రత్యర్థులపై ఆధిపత్యం ప్రదర్శించింది. యుకీ తన కెరీర్‌లో ఓ గ్రాండ్‌స్లామ్‌లో సెమీస్‌కు చేరుకోవడం ఇదే తొలిసారి. సెమీస్‌లో యుకీ, వీనస్ యూకేకు చెందిన నీల్ స్కుప్స్కీ-జో సాలిస్‌బరీ ద్వయంతో తలపడనుంది. ఉమెన్స్ సింగిల్స్ టైటిల్ ఫేవరెట్ ఇగా స్వైటెక్ పోరాటం ముగిసింది. క్వార్టర్ ఫైనల్‌లో ఈ పొలాండ్ క్రీడాకారిణి ఇంటిదారిపట్టింది. బుధవారం అర్ధరాత్రి జరిగిన మ్యాచ్‌లో ఆమెకు అమెరికా క్రీడాకారిణి అనిసిమోవా షాకిచ్చింది. వరుసగా రెండు సెట్లను 6-4, 6-3తో గెలిచి సెమీస్‌కు చేరుకుంది. స్వైటెక్‌పై పెద్దగా కష్టపడకుండానే గెలిచింది. కేవలం గంటా 36 నిమిషాల్లోనే విజయతీరాలకు చేరింది. స్వైటెక్ 3 డబుల్ ఫాల్ట్స్, 15 అనవసర తప్పిదాలతో మూల్యం చెల్లించుకుంది. తన కంటే తక్కువ ర్యాంక్ కలిగిన అనిసిమోవాను నిలువరించలేకపోయింది. స్వైటెక్ ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్, వింబుల్డన్ విజేతగా నిలిచింది. మరోవైపు, జపాన్ స్టార్ నవోమి ఒసాకా కూడా సెమీస్‌లో అడుగుపెట్టింది. క్వార్టర్ ఫైనల్‌లో ఆమె4-6, 6-7(3-7) తేడాతో చెక్ రిపబ్లిక్ క్రీడాకారిణి కరోలినా ముచోవాపై విజయం సాధించింది.

## మహిళల వన్డే ప్రపంచకప్ జట్టులో మార్పులు



**వేద న్యూస్ డెస్క్:**

మహిళల వన్డే ప్రపంచకప్ 2025కి ముందు టీమిండియా జట్టులో మార్పు చోటు చేసుకుంది. సెప్టెంబర్ 30 నుంచి భారత్ వేదికగా ఈ మెగా టోర్నీ జరగాల్సి ఉంది. అంతకంటే ముందే ఆస్ట్రేలియాతో టీమిండియా మహిళల జట్టు వన్డే సిరీస్ ఆడనుంది. అయితే ఆసీస్‌తో సిరీస్‌తో పాటు ప్రపంచకప్ కోసం ఎంపిక చేసిన జట్టులో బీసీసీఐ మార్పులు చేసింది. విశాఖపట్నంలో జరిగిన సన్నాహక శిబిరంలో వికెట్ కీపర్ బ్యాటర్ యాస్తికా భాటియా మోకాలికి గాయమైంది. దీంతో ఆమె ఆసీస్‌తో సిరీస్‌తో పాటు వన్డే ప్రపంచకప్‌కు సైతం దూరమైంది. ఈ విషయాన్ని బీసీసీఐ అధికారికంగా గురువారం ప్రకటించింది. ప్రస్తుతం భాటియా.. బీసీసీఐ వైద్య బృందం పర్యవేక్షణలో ఉందని వెల్లడించింది. ఆమె ప్లేసులో ఉమా ఛెత్రిని ఎంపిక చేసినట్లు తెలిపింది. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టు పెట్టింది. సెప్టెంబర్ 30 నుంచి జరగనున్న మహిళల వన్డే ప్రపంచకప్‌లో భారత్.. హర్మన్ ప్రీత్ సారథ్యంలో బరిలోకి దిగనుంది. ప్రపంచకప్ కంటే ముందే భారత్.. ఆస్ట్రేలియాతో మూడు వన్డేల సిరీస్ ఆడనుంది. ఆస్ట్రేలియాతో మూడు వన్డేల సిరీస్.. సెప్టెంబర్ 14, 17, 20 తేదీల్లో జరుగుతుంది. సెప్టెంబర్ 30 నుంచి వన్డే ప్రపంచకప్ కప్ ప్రారంభం కానుంది. నవంబర్ 2న జరిగే ఫైనల్‌తో విజేత ఎవరో తేలిపోనుంది. ఈ టోర్నీలో పాకిస్థాన్ ఆడే మ్యాచ్‌లు మాత్రం శ్రీలంక వేదికగా జరుగుతాయి. ప్రపంచకప్ కోసం ఎంపిక చేసిన భారత జట్టులో కడపకు చెందిన నల్లపురెడ్డి శ్రీ చరణి.. హైదరాబాద్ ప్లేయర్ అరుంధతి రెడ్డి చోటు దక్కించుకున్నారు.

## యూఏఈ బయలుదేరిన కెప్టెన్ సూర్యకుమార్, కోచ్ గంభీర్



**వేద న్యూస్ డెస్క్:**

యూఏఈ వేదికగా సెప్టెంబర్ 9 నుంచి 28 వరకు ఆసియా కప్ 2025 జరగనున్న విషయం తెలిసిందే. టోర్నీ ప్రారంభానికి ఐదు రోజులు కూడా లేదు. ఇప్పటికే పాకిస్థాన్, అఫ్గానిస్థాన్ జట్లు యూఏఈలో అడుగుపెట్టాయి. తాజాగా టీమిండియా సైతం యూఏఈకి బయలుదేరింది. అయితే ఈసారి జట్టులా కాకుండా ఆటగాళ్లు వ్యక్తిగతంగా యూఏఈకి పయనం అవుతున్నారు. ఈ మేరకు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ .. ముంబై ఎయిర్‌పోర్ట్ నుంచి యూఏఈకి పయనం అయ్యాడు. ఆసియాకప్ 2025 కోసం బీసీసీఐ సెలక్షన్ కమిటీ 15 మంది ఆటగాళ్లతో కూడిన జట్టును ప్రకటించింది. ఈ జట్టుకు కెప్టెన్‌గా సూర్యకుమార్ యాదవ్ ఎంపికయ్యాడు. వైస్ కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్ ఉన్నాడు. ఆటగాళ్లంతా తమ తమ స్వస్థలాల నుంచి నేరుగా యూఏఈకి చేరుకోవాల్సి ఉంది. దీంతో గురువారం కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా, టీమిండియా హెడ్‌కోచ్ గౌతమ్ గంభీర్ యూఏఈ ఫ్లైట్ ఎక్కారు. ఇతర ప్లేయర్లు సైతం బయలుదేరుతున్నారు. సెప్టెంబర్ 5న టీమిండియా ప్లేయర్లంతో తొలి ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొననున్నారు. ఇంగ్లాండ్‌తో టెస్ట్ సిరీస్ తర్వాత సుమారు నెలరోజుల పాటు ఆటగాళ్లకు రెస్ట్ దొరికింది. ఇక ఆసియాకప్ నుంచి విరామం లేకుండా మ్యాచ్‌లు ఉన్నాయి. ఆసియాకప్ 2025లో మొత్తం 8 జట్లు పాల్గొంటున్నాయి. టీ20 ఫార్మాట్‌లో ఈ టోర్నీ జరగనుంది. డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో టీమిండియా బరిలోకి దిగుతోంది.

# సెప్టెంబర్ 6 అర్ధరాత్రి 2గంటల వరకు మెట్రో రైళ్లు

**వేద న్యూస్ డెస్క్:**

హైదరాబాద్ మహానగర వాసులకు శుభవార్త.. గణేశ్ నిమజ్జనాలను కనులారా వీక్షించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. ప్రజలకు అసౌకర్య కలగకుండా రవాణా సదుపాయాలు కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్ మెట్రోరైలు సంస్థ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. సెప్టెంబర్ 6వ తేదీన మొదటి రైలు ఉదయం 6గంటలకు మొదలుకుని అర్ధరాత్రి వరకు మెట్రో రైళ్లు రాకపోకలు సాగిస్తాయని మెట్రో రైల్ అధికారులు తెలిపారు. అన్ని స్టేషన్ల నుంచి సెప్టెంబర్ 7వ తేదీ తెల్లవారు జామున 1 గంటకు చివరి రైల్ బయల్దేరి 2 గంటలకు గమ్యస్థానాలకు చేరుకుంటాయని పేర్కొన్నారు. ఈ మేరకు హైదరాబాద్ మెట్రో రైల్ అధికారులు ఒక ప్రకటన విడుదల చేశారు. ముఖ్యంగా బడా గణపతి ఖైరతాబాద్ వినాయకుడి శోభాయాత్ర నేపథ్యంలో ఖైరతాబాద్, లక్డీకాపూల్ మెట్రో స్టేషన్లలో అదనపు సిబ్బందితోపాటు పోలీసులు, ప్రైవేటు సెక్యూరిటీతో పర్యవేక్షిస్తున్నామని హైదరాబాద్ మెట్రో రైల్ అధికారులు తెలిపారు. రద్దీకి అనుగుణంగా ఎంపిక చేసిన మెట్రో స్టేషన్లలో అదనపు టికెట్ కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఖైరతాబాద్?కు వచ్చే మెట్రో ప్రయాణికులు స్వీయ క్రమశిక్షణ పాటించి మెట్రో భద్రతా సిబ్బందికి సహకరించాలనివిజ్ఞప్తి చేశారు. ఈ సేవలను భాగ్యనగర వాసులు వినియోగించుకోవాలని కోరారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073